క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న విజయకుమార్

చిల్లకూరు(చిట్టమూరు): వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పలువురికి నెల్లూరుకు చెందిన డాక్టర్ రాజశేఖరరెడ్డి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు బత్తిన విజయకుమార్, నేతలు వంకా రమణయ్య, సన్నారెడ్డి బాబురెడ్డి, బత్తిన అనురాగ్ శ్రీహర్ష, ఆర్ఎంపీలు శ్రీనివాసులు, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



ఉచ్చూరు వెంకట సుబ్బారెడ్డి (ఫైల్)

ఓజిలి: మానమాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఉచ్చూరు వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన రెండు నెలల నుంచి అనారోగ్యంతో నెల్లూరు, చెన్నై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో చెన్నై విజయ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. సుబ్బారెడ్డి అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఫారెస్ట్ అధికారులకు జింక అప్పగింత



జింకను అడవిలోకి వదులుతున్న సిబ్బంది

దొరవారిసత్రం: దొరవారిసత్రం గ్రామ పరిధిలోని వడ్డికండ్రిగ వద్ద ఆదివారం చుక్కల జింక రావడంతో కుక్కలు వెండించాయి. దీన్ని గుర్తించిన స్థానికులు జింకను రక్షించి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం అధికారులకు సమాచారం ఇచ్చారు. రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఫారెస్ట్ సిబ్బంది తిరుపతయ్య, వేణు జింకను పట్టుకుని పక్షుల కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

హనుమంతుని విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో దాతలు

చిల్లకూరు: కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మెట్ల మార్గంలో హనుమంతుని విగ్రహం ఏర్పాటుకు ఆదివారం వేకువజామున భూమి పూజ నిర్వహించారు. మెట్ల మార్గం వద్ద 27 అడుగులతో విగ్రహం ఏర్పాటు చింతవరం గ్రామానికి చెందిన దోర్నాదుల సునీల్‌శెట్టి, సుహర్లత దంపతులు ముందుకొచ్చారు. దీంతో ఆలయ కమిటీ, దేవదాయశాఖ అనుమతులు మంజూరు చేయడంతో రూ.15 లక్షల ఖర్చుతో విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఆలయ ఈఓ నవీన్ కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్‌బాబుల పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

7న పెంచలకోనలో కృష్ణాష్టమి

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 7వ తేదీన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. స్వామివారికి ఉదయం 9 గంటలకు నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, రాత్రి శేషవాహనంపై స్వామిఅమ్మవార్ల క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైద్యసిబ్బంది, ఆశా వర్కర్స్‌కు కిల్కారీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



సమావేశానికి హాజరైన వైద్యసిబ్బంది, ఆశా వర్కర్స్



- వాయిస్ కాల్‌తో ఆరోగ్య సూచనలు, సలహాలు
- గర్భిణులు, బాలింతల సందేహాలు నివృత్తి
- కిల్కారీ సేవలపై ఆశాలు, అంగన్‌వాడీలకు శిక్షణ

కిల్కారీతో రక్ష!

దక్కిలి: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్యపరీక్షలు అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారీ పేరిట వాయిస్‌కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూప కల్పన చేసింది. ప్రతివారం గర్భిణులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాయిస్ కాల్ వస్తుంది. ఈ వాయిస్‌కాల్ నిమిషం 30 సెకండ్ల పాటు ప్రతి గర్భిణి వినేలా కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

సందేహాలు నివృత్తి

మహిళ గర్భిణీగా ఉన్నప్పుడు స్థానికంగా ఉండే ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలను నమోదు చేసేటప్పుడు ఫోన్ నంబర్ నమోదు చేస్తారు. ఆ నంబర్‌కు కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయి. గర్భిణులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ కాల్ సందేశం ఉంటుంది. మహిళ గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, అలాగే బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్‌కాల్స్, సందేహాలు వస్తాయి.

ఆశా, అంగన్‌వాడీలకు ప్రత్యేక శిక్షణ..

కిల్కారీ సేవలకు సంబంధించి స్థానిక పీహెచ్‌సీలలో ఇప్పటికే ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ప్రతి నెలా మొదటి వారంలో జరిగే ఆశా కార్యకర్తలకు ఈ సేవలకు సంబంధించి వైద్యాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్లో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భోజన సదుపాయం, పోషక విలువలు కలిగిన ఆహారం పొందేందుకు వచ్చే గర్భిణులకు కిల్కారీ సేవలకు సంబంధించిన వీడియో చూపించేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేసేలా కార్యక్రమం రూపొందించారు.



దక్కిలిలో కిల్కారీ వాయిస్ కాల్‌ను వింటున్న గర్భవతి

01244588000 నుంచి వాయిస్ కాల్స్..

గర్భిణులు, పాలిచ్చే తల్లులు మొబైల్‌కు ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్యపరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. 01244588000 నుంచి వాయిస్ కాల్ నిమిషం 30 సెకండ్ల పాటు ఉంటుంది. గర్భిణులు బిజీగా ఉండి ఫోన్ లిఫ్ట్ చేయని పరిస్థితుల్లో ఐవీఆర్ సిస్టమ్ ఆటోమెటిక్‌గా ఒకే రోజు మూడుసార్లు ఫోన్‌కాల్స్ వచ్చేలా చేస్తుంది. మరలా సంబంధిత సందేశాలను వినాలని అనుకుంటే 14423 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినే సౌకర్యం కూడా కిల్కారీ ద్వారా కల్పించారు

ఎంతో అవగాహన వచ్చింది



ప్రభుత్వం కిల్కారీ సేవల వలన ఎంతో అవగాహన కలిగింది. మనకు గుర్తు లేకున్నా వాయిస్ కాల్‌తో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరిస్తుంది. ఒక వేళ వాయిస్ కాల్ వచ్చినప్పుడు వినకపోతే 14423కి కాల్ చేస్తే మళ్లీ వినే అవకాశం ఉంటుంది. ప్రతివారం మాకు ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఇంటి వద్దకు వచ్చి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. కిల్కారీ సేవలు గురించి వివరిస్తున్నారు.

కౌసల్య, గర్భిణి, సంగనపల్లి

కిల్కారీపై అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు పాలిచ్చేలా తల్లులు కోసం ప్రవేశపెట్టిన కిల్కారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. గ్రామంలో గర్భిణులు, బాలింతల ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా వాయిస్ కాల్స్ వస్తాయి. ప్రతి వారం ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నాం.

ఎం. నాగమణి, ఏఎన్ఎం, దక్కిలి పీహెచ్‌సీ

సద్వినియోగం చేసుకోవాలి



మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా గర్భిణులు, బాలింతలు పిల్లలు ఆరోగ్యానికి సంబంధించి సందేశాలు వస్తాయి. వాయిస్ కాల్ వినడం ద్వారా గర్భిణులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి సంరక్షించే ఈ మహోత్తర కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

బిందు ప్రియాంక, డాక్టర్, దక్కిలి పీహెచ్‌సీ

కార్తీక దీపారాధన భవనాలకు భూమిపూజ



భూమిపూజలో దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రసూనంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ సమీపంలో కార్తీక దీపారాధన కోసం రూ.40 లక్షలతో నూతన భవనాల నిర్మాణాలకు ఆలయ నిర్వాహకులు ఆదివారం భూమిపూజ చేశారు. కార్తీక వన దీపారాధనకు ఆలయం సమీపంలో ఉన్న స్థలాన్ని దాతలు కావేరిపాకం వల్లేమ్మ, సిద్ధయ్య కుటుంబసభ్యులు ఆలయానికి వితరణగా అందించారు. దీంతో దాతల సహకారంతో భవన నిర్మాణ పనులకు శ్రీకారంచుట్టారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభావతమ్మ, కమిటీ సభ్యులు యూ.భాస్కర్‌రెడ్డి, రాధాకృష్ణయ్య, అంకయ్య, సుదీర్, పూజారి బాలాజీ పాల్గొన్నారు.

వేగవంతంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు



అనంతమడుగులో నిర్మిస్తున్న కాలువ



లింగసముద్రంలో సీసీ రోడ్డు

సైదాపురం: మండలంలోని లింగసముద్రం, అనంతమడుగు గ్రామపంచాయతీల్లో శరవేగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అందిన నిధులతో ఆయా గ్రామ పంచాయతీల్లో పనులను పూర్తిచేస్తున్నారు. అనంతమడుగు గ్రామ పంచాయతీలో రూ.20లక్షలతో కాలువల నిర్మాణ పనులను పూర్తి చేశారు. అలాగే లింగసముద్రంలో సర్పంచ్ వరప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో రూ.10.50 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు.

దివ్యాంగులకు ఫలసరుకుల పంపిణీ



ఫలసరుకులు అందజేస్తున్న దాతలు

గూడూరురూరల్: సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలోని ఆడిటోరియంలో సిద్ధారెడ్డి జనార్దన్‌రెడ్డి దివ్యాంగుల చేయూత కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. ఓజిలి మండలం బట్లకనుపూరుకు చెందిన గున్నం సేవా ట్రస్ట్ నిర్వాహకులు బత్తల రవీంద్రరెడ్డి, శారదమ్మ హాజరై దివ్యాంగులకు నెలకు సరిపడా 18 రకాల ఫలసరుకులను అందజేశారు.

కారుడ్రైవర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబాన్ని విడిచి ఉండలేక, స్నేహితురాలికి న్యాయం చేయలేక మనస్తాపానికి గురైన ఓ కారుడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు..తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన శారద, వెంకటసుబ్బరాజు దంపతులు. వారికి శ్రీధర్(30), యమున సంతానం. శ్రీధర్ అవివాహితుడు. మూడేళ్లుగా కారుడ్రైవర్‌గా పనిచేస్తూ నెల్లూరులోనే ఉంటున్నాడు. అప్పుడప్పుడు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వచ్చేవాడు. భర్తతో విడిపోయి ఇద్దరు కుమారులతో ఉంటున్న ఓ మహిళతో ఆయనకు పరిచయం అయింది. అది కాస్తా సాన్నిహిత్యానికి దారితీయడంతో కావేరినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయాన్ని నెల రోజుల కిందట శ్రీధర్ తన తల్లికి ఫోన్‌లో తెలియజేయగా ఇది మంచి పద్ధతి కాదని, పరువుపోతుందని సూచించింది. పెడచెవిన పెట్టిన శ్రీధర్ ఆమె లేకపోతే తాను చచ్చిపోతానని బెదిరించాడు. దీంతో శారద కుమారుడి వద్దకొచ్చి కొద్దిరోజులు అతనితోనే ఉండి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. అయినా ఫలితం లేకపోవడంతో గూడూరు వెళ్లిపోయింది. కొద్దిరోజుల అనంతరం శ్రీధర్ తన తల్లికి ఫోన్ చేసి బాగా గుర్తుకొస్తున్నారని, అలాగని స్నేహితురాలిని విడిచి రాలేనని బాధపడ్డాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పిల్లల ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని స్నేహితురాలు అడుగగా వారి మధ్యన వాగ్వివాదం చోటుచేసుకుంది, 'నిన్ను చేరదీసినందుకు నా కుటుంబానికి దూరమయ్యానని, నేను చస్తేనే అన్ని సర్దుకుంటాయని' అంటూ శ్రీధర్ గదిలోకి వెళ్లి తలుపునకు గడియపెట్టుకున్నాడు. అనంతరం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న శారద తన కుటుంబసభ్యులతో కలిసి హుటాహుటిన కావేరినగర్‌కు చేరుకుంది. స్థానికుల సహకారంతో గది తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి శ్రీధర్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు బాధిత తల్లి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఎనిమిది గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

సైదాపురం: మండలంలోని చీకవోలు గ్రామంలో పిడుగులు పడి సుమారు రూ.లక్ష రూపాయలు విలువ చేసే 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు మండలంలో ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులతో కూడిన జోరు వర్షం కురిసింది. ఈక్రమంలో చీకవోలు గ్రామానికి చెందిన వంగపాటి కోటయ్యకు చెందిన 8 గొర్రెలు పిడుగు పడి మృతిచెందాయి.

సత్ప్రవర్తనతో మెలగాలి

కోట: రౌడీ షీటర్లు తమ నడవడిక మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని వాకాడు సీఐ హరిక్రిష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కోట పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. వివాదాలను దూరంగా ఉంటూ మంచి పేరు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. ఎస్ఐ పుల్లారావు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

పెళ్లకూరు: పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కొండాపురం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. సోమవారం కొండాపురం రెవెన్యూ కార్యాలయంలో శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి తీవ్రగాయాలు

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని బల్లవోలు సమీపంలో ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బల్లవోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు చెంచుకిరణ్‌రెడ్డి తన పొలంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా కల్వర్టు వద్ద నెల్లూరు నుంచి కోట వెళ్లే వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతని వాహనాన్ని ఢీకొంది. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతినగా డ్రైవింగ్ చేస్తున్న కిరణ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన పొలాల్లోని రైతులు, కూలీలు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు

చిల్లకూరు(చిట్టమూరు): చిట్టమూరు మండలం మెట్టు గ్రామ సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లో దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేశారు. చిట్టమూరు ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గ్రామస్తులు కొంతమంది మెట్టులోని ఇసుక రీచ్ వద్దకు వెళ్లి పనులను అడ్డగించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కృష్ణయ్య, వెంకటయ్య, ముత్యాలయ్య ముగ్గురు రీచ్ వద్ద ఉన్న షెల్టర్లను తొలగించి దౌర్జన్యం చేసినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర పండుగగా పోలేరమ్మ జాతర



అంకమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న కౌన్సిలర్లు

-మిన్నంటిన సంబరాలు

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని 19వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ వహిద, యస్థాని దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఆ వార్డులోని అంకమ్మ ఆలయం వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, మహిళా కౌన్సిలర్లు అంబలితో గ్రామోత్సవంలా ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా జీఓ విడుదల చేయడంపై వెంకటగిరిలో సంబరాలు జరుపుకుంటున్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మున్సిపల్ విప్ పూజారిలక్ష్మి, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు సుబ్బారావు, జానకిరామయ్య, ఎంఏ నారాయణ, చంద్రశేఖర్, కందాటి కల్యాణి, సుకన్య, దేవికాచౌదరి, నాయకులు పి శ్రీను, సిహెచ్ మురళి పాల్గొన్నారు.

రైల్వే అటెండర్ అరెస్ట్



చోరీకి పాల్పడిన అటెండర్ సంతోష్ అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

గూడూరురూరల్: రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ వద్ద నుంచి బంగారు చైన్, నగదు దొంగిలించిన కేసులో రైల్వే అటెండర్‌పై కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. భువనేశ్వర్ నుంచి తిరుపతి ప్రయాణిస్తున్న రైలులో గూడూరుకు చెందిన రమాదేవి అనే మహిళ విశాఖపట్నం నుంచి గూడూరుకు వస్తోంది. అయితే ఆమె ప్రయాణిస్తున్న కోచ్‌లోనే అటెండర్‌గా ఉన్న సంతోష్ అనే వ్యక్తి 56 గ్రాముల బంగారు గొలుసుతో పాటు రూ.20,500 నగదు ఉన్న ఆమె పర్సును దొంగిలిచాడు. ఈ విషయం ఆమె గూడూరు రైలు దిగే సమయంలో గుర్తించి గూడూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసుల అప్రమత్తమై రైలు రేణిగుంటకు చేరేలోపు ఆమె చెప్పిన వివరాల ఆధారంగా అటెండర్‌ను పట్టుకుని ప్రశ్నించడంతో నేరం ఒప్పుకున్నాడు. దీంతో అతని నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని చెప్పారు.

పిడుగుపడి రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదె

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో శనివారం పిడుకుపాటుకు రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఒబ్బు సుభాష్ చంద్రయ్య, యత్రాబత్తిన మధుకు చెందిన రెండు గేదెలు వ్యవసాయ పొలాల్లోకి మేతకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా పిడుగుపాటుకు గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనలో ఒక్కో రైతుకు సుమారు రూ.50 వేలుకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంట నిల్వ గోదాము సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా గోదాము

చిల్లకూరు: రైతులకు విపత్కర పరిస్థితులు ఏర్పడిన సమయంలో తాము పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే చిల్లకూరు మండలంలో అంకులపాటూరు గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునే విధంగా రూ.40 లక్షలతో గోదామును నిర్మించారు. చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఎన్‌డీసీసీబీ, నాబార్డు సౌజన్యంతో ఒక ఎకరాలో గోదామును నిర్మించారు. రామారెడ్డిపాళెం, బల్లవోలు, చింతవరం, కాకువారిపాళెం, కొరావారిపాళెం గ్రామాల్లో వర్షాలు కురిసిన సమయంలో చెన్నయ్య మడుగు పూర్తిగా మునిగి పోతుంది. దీంతో ఆ ప్రాంతాల్లో పండించిన ధాన్యం నిల్వ చేసుకోవాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఈ గోదాము ఎంతో వెసులుబాటును కల్పిస్తుంది. అలాగే పీఏసీఎస్ కింద మండలంలోని 35 గ్రామాల్లో 4 వేల మంది రైతులు ఉండగా వీరిలో ఎవరికైనా గోదామును వినియోగించుకోవాలనుకుంటే పీఏసీఎస్‌లో కార్యదర్శిని సంప్రదించి వినియోగించుకోవచ్చని అంటున్నారు. నిర్మాణం పూర్తి చేసుకుంటున్న గోదామును త్వరలో స్థానిక ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు తెలిపారు.